క్లుప్తంగా

రేషన్ దుకాణాల వద్ద బారులు



బాలాపూర్ రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారుల పడిగాపులు

బడంగ్‌పేట్: రేషన్ దుకాణాల వద్ద తెల్లరేషన్‌కార్డుదారులు బారులు తీరుతున్నారు. బాలాపూర్ మండల పరిధిలోని బడంగ్‌పేట, అల్మాస్‌గూడ, బాలాపూర్, మల్లాపూర్, వెంకటాపూర్, మామిడిపల్లి, నాదర్‌గుల్, గుర్రంగూడ, ప్రాంతాలల్లో ఉన్న రేషన్ దుకాణాల వద్ద ఎప్పుడు లేని విధంగా ఉదయం నుంచే క్యూ కడుతున్నారు. దీనికి తోడు మూడు నెలల రేషన్ కోసం మూడుసార్లు వేలిముద్రలు సేకరిస్తుండడంతో సర్వర్ సమస్యలు తలెత్తుతున్నాయని రేషన్‌దుకాణాల డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు టేకుల శశిధర్‌రెడ్డి అన్నారు. రేషన్ విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆటస్థలం కేటాయించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇమామ్‌గూడ గ్రామస్తులు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని ఇమామ్‌గూడ ప్రాథమిక పాఠశాలకు ఆటస్థలం కేటాయించాలని శుక్రవారం గ్రామస్తులు మహేశ్వరం తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలకు స్థలం లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారని చెప్పారు. పాఠశాల మైదానానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీకుమారి, నాయకులు హరికృష్ణారెడ్డి, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కులను అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో ముగ్గురు బాధితులకు మంజూరైన చెక్కులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రాజేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అంజయ్య, సునీతాబాలరాజు, సిరూర్ బాల్‌రాజ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

హుడాకాంప్లెక్స్: ఇటీవల విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ ఘనంగా సన్మానించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలోనే అత్యుత్తమ నైపుణ్యత గల అధ్యాపకులు ఉంటారని, ప్రభుత్వం విద్యపై దృష్టి సారించడం వల్లే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతున్నామని చెప్పారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 979 మార్కులు సాధించిన మదియా తహసీన్‌ను, 950 మార్కులు సాధించిన పి.దార్తిలను సన్మానించారు. ప్రభుత్వ కళాశాలలో బోధన బాగుంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లలని ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలని కోరారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అగ్రికల్చర్ కోర్సులో ఉన్నత విద్య అభ్యసించాలని ఉందని తహసీన్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, చంద్రయ్య, మేరీ, లలిత పాల్గొన్నారు.

నాడు వందల్లో.. నేడు పదుల్లో



అసంపూర్తి పనులతో లెనిన్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం

- పడిపోయిన సర్కారు బడి విద్యార్థుల సంఖ్య
- అప్‌గ్రేడ్ అంటూ.. పాతభవనం కూల్చివేత
- మూడేళ్లు గడిచినా పూర్తికాని నూతన భవనం
- అరకొర సౌకర్యాలతో తాత్కాలికంగా కొనసాగుతున్న పాఠశాల
- ఆసక్తి చూపని విద్యార్థులు

మీర్‌పేట: కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్లుంది ప్రభుత్వ నిర్ణయం!. ఉన్న బడి స్థాయి పెంచాలని సంకల్పించి, సుమారు 400 వందల మంది విద్యనభ్యసిస్తున్న పాత బడిని కూల్చివేసింది. నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టి మూడేళ్లు కావస్తున్నా భవనం పూర్తికాలేదు. ఆ పాత శాలను తాత్కాలికంగా మరోచోట కొనసాగిస్తున్నప్పటికీ.. విద్యార్థుల సంఖ్య 30కి చేరింది. విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది.

రూ.3 కోట్లతో..

గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలనే ఉద్దేశంతో పాత భవనాన్ని కూల్చివేసింది. నూతన భవన నిర్మాణానికి నాటి విద్యాశాఖ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితారెడ్డి ఓ ప్రైవేటు సంస్థ నుంచి రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయించారు. అనంతరం నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో.. అందులో చదువుకుంటున్న విద్యార్థులను.. విద్యాశాఖ అధికారులు, సమీపంలోని చింతలకుంట, హెడ్‌క్వార్టర్స్‌లోని ఓ భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బడిలో కొందరిని, చిన్నారుల సంఖ్యను అనుగుణంగా భవనం లేక, తగిన సౌకర్యాలు లేకపోవడంతో చాలా మందిని ఇతర ప్రభుత్వ బడుల్లో సర్దుబాటు చేశారు.

ఏడాదిన్నరగా ఎదురు చూపులే..

నాడు తొలినాళ్లలో భవన నిర్మాణ పనులు వేగంగా జరిగినప్పటికీ.. ఎన్నికలు రావడంతో పనులకు ఆటంకం కలిగింది. ప్రస్తుతం ఆ ప్రాథమిక పాఠశాల చింతలకుంట కమ్యూనిటీహాల్ ఆవరణలోని భవనంలో తాత్కాలికంగా కొనసాగుతోంది. 400 మంది వరకు పిల్లలు ఉన్న పాఠశాలలో ఇప్పుడు కేవలం 30 మంది మాత్రమే ఉండటం గమనార్హం. ఏడాదిన్నరగా.. పనులు నిలిచిపోవడం, మరో కొద్ది రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా.. ప్రస్తుత విద్యా సంవత్సరం కూడా భవనం అందుబాటులోకి వచ్చే అవకాశం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. భవనాన్ని అసంపూర్తిగా వదిలేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, భవిభవన నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని స్థానిక మాజీ కార్పొరేటర్లు, నాయకులు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.

ప్రైవేటు బాట..

ఉన్న బడిని కూల్చివేసి, అందులోని చిన్నారులను.. తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసిన పాఠశాల, ఇతర సర్కారు బడుల్లో చేర్పించినప్పటికీ.. ఇరుకు గదులు, సౌకర్యాల కొరతతో కొందరు, ఇతర ప్రాంతాలకు వెళ్లడం ఇష్టంలేక మరికొందరు ప్రైవేటు పాఠశాలల బాట పట్టారు. ఇలా కారణం ఏదైనప్పటికీ.. పిల్లల సంఖ్య తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఓ వైపు విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు ప్రభుత్వం, ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో శ్రమిస్తున్నప్పటికీ.. అప్‌గ్రేడ్ పేరుతో విద్యాశాఖ అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా లెనిన్‌నగర్ బడిలో వందల్లో ఉన్న సంఖ్య నేడు ముప్పైకి పడిపోవడం చర్చనీయాంశంగా మారింది.

విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం



లెనిన్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో చదివేవారంతా నిరుపేదల పిల్లలే. గతంలో విద్యార్థులతో నిండుగా ఉండే పాఠశాల.. ప్రస్తుతం వెలవెల బోతోంది. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వం.. భవన నిర్మాణ పనులు పూర్తిచేయించి, వినియోగంలోకి తేవాలి. విద్యార్థులతో కళకళలాడేలా చేయాలి.

– ఇంద్రావత్ రవినాయక్, మాజీ కార్పొరేటర్



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు

ప్రభుత్వ నిర్ణయం విరమించుకోవాలి

మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్

కందుకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు సీఐటీయూ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఎంఈఓ నర్సింలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాలరాజు మాట్లాడుతూ.. 23 ఏళ్లుగా కష్టనష్టాలకు ఓర్చుకుని వంట చేసిపెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల ముందు రూ.10 వేల వేతనం ఇస్తామని చెప్పి, నేటికీ అమలు చేయకుండా ప్రైవేట్ సంస్థలకు అప్పగించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్ సంస్థలకు అప్పగించే పనులను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి శ్రీనివాస్, అండాలు, బాలమణి, లక్ష్మమ్మ, రాణి, అలివేలు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది ఆరోగ్యమే ప్రధానం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

- బడంగ్‌పేట కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట్: శానిటేషన్ సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే కార్పొరేషన్ పరిశుభ్రంగా ఉంటుందని కమిషనర్ పి.సరస్వతి అన్నారు. వంద రోజుల ప్రణాళిక అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె బడంగ్‌పేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో శానిటేషన్ సిబ్బందికి, ఇతర సిబ్బందికి వైద్యపరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 300 మందికి పైగా ఉన్న శానిటేషన్ సిబ్బందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు. వందరోజుల ప్రణాళికను విజయవంతం చేసి బడంగ్‌పేట కార్పొరేషన్‌ను జిల్లాలోనే గుర్తింపు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎంసీ శ్యామ్ సుందర్, డీఈఈ వెంకన్న, ఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ నాగేశ్వర్‌రావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ యాదగిరి, డివిజన్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై వ్యక్తిగత శ్రద్ధ అవసరం

తుక్కుగూడ: పారిశుద్ధ్య కార్మికులు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ వాణి సూచించారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం అయిన వారికి మందులు అందజేశారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సామిక్ కుమార్, ఆర్ఐ మల్లేష్, సిబ్బంది స్ఫూర్తి, ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో బడి బాట



తిమ్మాపూర్‌లో ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం

కందుకూరు: ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల కంటే తమ పాఠశాలలోని విద్యార్థులే ప్రథమ స్థానంలో నిలుస్తున్నారని.. ఉత్తీర్ణతా శాతంలోనూ ప్రభుత్వ విద్యార్థులే ముందున్నారని వివరిస్తున్నారు. సంబంధిత వివరాలతో ముద్రించిన కరపత్రాలతో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేరి్పంచి ప్రభుత్వం అందించే వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పది ఫలితాల్లో మండల స్థాయిలో తిమ్మాపూర్ పాఠశాలే ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. మాదాపూర్, జబ్బార్‌గూడ, బేగంపేటలోని విద్యార్థులను అధిక సంఖ్యలో తమ పాఠశాలలోనే చేర్పించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు ఎం.యాదగిరి, ఎం.రవి, ఎం.మహేశ్, గ్రామస్తులు ఎస్.హరినాథ్‌గౌడ్, వి.నర్సింహగౌడ్, ఎస్.నరేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- మీ పిల్లలను సర్కారు బడిలో చేర్పించండి
- మండల విద్యాధికారి కస్నా నాయక్

మహేశ్వరం: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని, మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాధికారి కస్నా నాయక్ కోరారు. శుక్రవారం మండల పరిధి తుమ్మలూరు గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, విశాలమైన తరగతి గదులు, మైదానంతో కూడిన వసతులతో ప్రశాంతమైన వాతావరణంలో పాఠాలు బోధిస్తున్నామని పేర్కొన్నారు. డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉచితంగా మధ్యాహ్న భోజనం, యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేరి్పంచి, బడులను బలోపేతం చేయాలని కోరారు. అంతకు ముందు పాఠశాలలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో చేసిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న గ్రామ యువకులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి, పూర్వ విద్యార్థులు యాదగిరి, మహబూబ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



బడిబాటలో చిన్నారులకు ప్రవేశ పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ

భూ భారతితో రైతులకు భరోసా

డిప్యూటీ తహసీల్దార్ నవత

మహేశ్వరం: భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరగనుందని, అందులో భాగంగానే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ నవత అన్నారు. రైతు సదస్సులతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధి డబిల్‌గూడలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూ సమస్యలు ఉన్న రైతులు తమ సమస్యలను అధికారులు దృష్టికి తేవాలని సూచించారు. అనంతరం వాటికి తగిన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో 7 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ స్వర్ణకుమారి, జూనియర్ అసిస్టెంట్ నరేందర్, రికార్డు అసిస్టెంట్ లక్ష్మణ్, టైపిస్టు కల్పన, పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద ప్లాస్టిక్ కవర్ల పంపిణీ

చాదర్‌ఘాట్: బక్రీద్ పండుగను పురస్కరించుకుని జంతు కళేబరాలను తొలగింపునకు మసీదుల వద్ద సర్కిల్–6 పరిధిలో 40 వేల కవర్లు పంపిణీ చేసినట్లు ఏఎంహెచ్‌ఓ రుద్ర శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన మలక్‌పేటలో విలేకరులతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 66 లిఫ్టింగ్ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో 20 లిఫింగ్ పాయింట్లను గుర్తించి, ఎప్పటికప్పుడు తొలగించేందుకు శానిటేషన్ సిబ్బందిని నియమించామన్నారు. సర్కిల్ పరిధిలో 30 భారీ వాహనాలు, 15 ఎక్స్‌కవేటర్లను,10 టస్నర్స్, భారీ వాహనాలు 18, మినీ టిప్పర్స్ 8 సిద్ధం చేసినట్లు ఆయన వివరించారు.

కల్యాణం.. కమనీయం..

- ఘనంగా స్నేహపురికాలనీలో వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

నాగోలు: కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి వేదమంత్రాల మధ్య సాంప్రదాయ బద్ధంగా స్వామి వార్ల కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. శుక్రవారం దేవాలయంలో చంద్రప్రభ వాహనసేన నిర్వహించారు. స్వామి వారిని ఉభయ దేవేరులతో స్నేహపురి కాలనీ తదితర పురవీధుల్లో గురుడ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ హయాంలోనే దేశాభివృద్ధి

నాగోలు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాగోలులోని శుభం కన్వెన్షన్‌లో రంగారెడ్డి జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యశాల సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ, వార్డు స్థాయిలోకి వెళ్లి ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఈ సందర్భంతా పార్టీ జెండా ఆవిష్కరించిన ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 11 ఏళ్ల విజయవంతమైన పాలనకు గుర్తుగా నేతలు, కార్యకర్తలు కలిసి మొక్కలు నాటారు. దేశంలో బీజేపీ ప్రభుత్వ 11 ఏళ్ల మోదీ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. త్వరలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రజల మధ్యలో నిర్వహించి ఆరోగ్యంపై చైతన్యం తీసుకురావాలని, యోగా దినోత్సవం, డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దినోత్సవం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మోదీ 11 ఏళ్ల పాలనలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని. 50 ఏళ్ల ఎమర్జెన్సీ చీకటి అధ్యాయాన్ని గుర్తు చేసుకుంటూ ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి, శ్యామప్రసాద్ ముఖర్జీ బలిదానం దేశ సమైక్యతకు నిలువెత్తు ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రబారి సుభాష్ చందర్ జీ, అసెంబ్లీ కన్వీనర్లు, జిల్లా కమిటీల కన్వీనర్లు ,కో కన్వీనర్లు, డివిజన్ అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, ప్రధాన కార్యదర్శులు, మాజీ డివిజన్ అధ్యక్షులు, రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కందుకూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. మండల పరిధి గూడూరుకు చెందిన పి.రాజుముదిరాజ్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. దీంతో అతనితో పాటు కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 1999- 2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న బాల్య మిత్రులు ఏకమై.. రూ.50 వేలను మిత్రుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. అదే గ్రామానికి చెందిన మరో పూర్వ విద్యార్థి జహంగీర్‌పాషా రూ.20 వేల ఆర్థిక సహాయం చేయడంతో పాటు మృతుడి కుమారుడు, కుమార్తెల చదువుకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చాడు.

కంచె వేయరు.. చెట్లు తొలగించరు!

- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పొంచి ఉన్న ప్రమాదం
- చెట్లు పెరిగిపోవడంతో కనిపించని ట్రాన్స్‌ఫార్మర్లు
- తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకుపోయిన చెట్లు

హస్తినాపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం, వనస్థలిపురం, లింగోజిగూడ, చంపాపేట డివిజన్ల పరిధిలోని వివిధ ప్రాంతాలలో కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చాలానే ఉన్నాయి. దానికి తోడు చెట్లు పెరిగిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లు కనిపించడం లేదు. దీని వల్ల తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. గాలికి చెట్ల కొమ్మలు ట్రాన్స్‌ఫార్మర్లకు తగలడంతో షార్టు సర్క్యూట్ అవుతోంది. విద్యుత్ శాఖ అధికారులు కేవలం స్తంభాల తీగలపై పడకుండా మాత్రమే కొమ్మలను కొట్టి

◆ ట్రాన్స్‌ఫార్మర్‌లు తరుచూ ట్రిప్ కావడంతో ఫ్యూజ్‌లు పోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ వేయాలంటే సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకుని వేయాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వారు వచ్చే వరకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోతోంది. ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయి..



విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఇంట్లోని ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయి. ఎప్పుడు కరెంటు ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలి.

– నవనీత, గృహిణి